క్లుప్తంగా

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ కోరారు. ఆయన శనివారం మున్సిపాలిటీ పరిధిలోని హన్మంతాపూర్‌లో పర్యటించారు. వార్డులో పారిశుద్ధ్యం పనులను పరిశీలించి, వార్డు ప్రజలతో మాట్లాడారు. అందరు తమ ఇళ్ల చుట్టూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

పెద్దశంకరంపేట(మెదక్): విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎస్‌ఐ శంకర్ కస్తూర్బా ప్రిన్సిపాల్ విజయకు సూచించారు. శనివారం కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు అందిస్తున్న భోజనంలో నాణ్యత లోపించకుండా చూడాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ.సునీత, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కాలభైరవస్వామికి పూజలు



పూజలు చేస్తున్న అర్చకుడు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్న సమీపంలోని కాలభైరవస్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం కాలభైరవస్వామికి భక్తులు భస్మాభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వెల్మకన్నలోని బాల వీరహనుమాన్ ఆలయంలో అర్చకులు మెట్టురాములుశర్మ ఆంజనేయస్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, చందనం అలంకరించారు.

ఉత్సాహంగా వనభోజనాలు

నర్సాపూర్: ఆర్టీసీలోని ఉద్యోగులు ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండడానికే కార్తిక మాసం వన భోజనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డిపో ఇన్‌చార్జి మేనేజర్ సురేఖ చెప్పారు. శనివారం డిపో ఆవరణలో కార్తిక మాస వనభోజనాల కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొనగా, వారికి పలు రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో సీఐ వీరబాబు, ఎంఎఫ్ సుగుణాకర్, ఎస్టీఐ లక్ష్మణ్, గ్యారేజ్ ఇన్‌చార్జి శ్రీనివాస్, వెల్ఫేర్ బోర్డు సభ్యులు వెంకటేష్‌గౌడ్, శ్యాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

పాపన్నపేట(మెదక్): పాడి రైతులు తమ పశువుల పోషణలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ సౌమ్యరెడ్డి అన్నారు. శనివారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నాగ్‌సాన్‌పల్లిలో పశు సంవర్ధక గర్భస్థ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె పశుపోషణపై అవగాహన కల్పించారు. ప్రతీ పశువుకు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా శిబిరంలో పశువులకు పరీక్షలు చేసి, మందులు తాగించారు. కార్యక్రమంలో డాక్టర్ నాగార్జున పాటిల్, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ సలావుద్దీన్, సతీష్ కుమార్, గోపాల్, శివాజీ, గోపాల మిత్ర సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రెడ్డి, గోపాల మిత్రులు షారుద్దీన్, సాయిలు, బాలరాజ్, సిబ్బంది యాదయ్య సుధాకర్ పాల్గొన్నారు.

చాముండేశ్వరికి జడ్జి పూజలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని చిట్కుల్ గ్రామ శివారులోని చాముండేశ్వరిని మేడ్చల్ కోర్టు జడ్జి అర్జున్ కుటుంబసభ్యులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ఆలయ ఆవరణలోకి వచ్చిన జడ్జి అర్జున్ కుటుంబసభ్యులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం వారికి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా ఆయుఃఆరోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

ఎల్‌ఓసీ అందజేత

మనోహరబాద్(తూప్రాన్): మండలంలోని లింగారెడ్డి గ్రామానికి చెందిన దయానందచారి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం మాజీ ఉపాధ్యక్షుడు మల్లేశ్ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి చారి అనారోగ్య సమస్యను వివరించారు. స్పందించిన ఎంపీ చికిత్స కోసం రూ.2లక్షల 50 వేల ఎల్‌ఓసీ మంజూరు చేసి, దాన్ని బాధిత కుటుంబీకులకు అందించారు.

'కంది' పోకుండా జాగ్రత్త పడాలి

- ప్రస్తుతం పూత దశలో కంది పంట
- పంటకు సోకుతున్న పురుగు
- కేవీకే కీటక శాస్త్రవేత్త రవికుమార్ సూచనలు



తునికిలో కందిపంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు



కందికాయను తొలుస్తున్న పురుగు

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రస్తుతం కంది పంట పూత కాతదశలో ఉంది. ఈ దశలో అధిక దిగుబడి రావాలంటే రైతులు తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కేవీకే కీటక శాస్త్రవేత్త రవికుమార్ సూచించారు. ప్రస్తుత వాతావరణం సైతం మేఘాలతో మబ్బులు పట్టి ఉండటంతో కందిపంటపై తెగులు, పురుగులు సోకే అవకాశం ఎక్కువగా ఉంది. రైతులు మొదట్లోనే గుర్తించి నివారణ చర్యలు తీసుకోకపోతే రైతుకు నష్టం జరుగుతుందని కేవీకే కీటక శాస్త్రవేత్త రవికుమార్ తెలిపారు. మండలంలోని తునికి వద్ద గల డాక్టర్ రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) కీటక శాస్త్రవేత్త రవికుమార్ పలు రైతుల కంది పంటలను పరిశీలించగా, మారుక మచ్చల పురుగు, శనగపచ్చ పురుగు, కాయ ఈగ ఆశిస్తుండటం గమనించినట్లు తెలిపారు. రైతులు నివారణ చర్యలు తీసుకోవాలన్నారు.

మారుక మచ్చల పురుగు

పూతదశలో ఉన్న కందిపంట పూమొగ్గపై, లేత ఆకులపై, పిందెలపైన తల్లి రెక్కల పురుగు పసుపు పచ్చని గుడ్లని పెడుతుంది. గుడ్లనుంచి వెలువడిన లార్వాలు ఆకులు, పువ్వులు, కాయలను కలిపి గూళ్లుగా చేసి మొగ్గలని, పిందెలని, కాయలను తొలచి తింటాయి. తొలచిన కాయ రంధ్రం దగ్గర లార్వా విసర్జాలు కనిపిస్తాయి. కందిపంట పూత దశలో ఉన్నప్పుడు ఆకాశం మేఘా వృతమైనప్పుడు, పోగమంచు, అప్పుడప్పుడు చిరుజల్లులు కురిసినప్పుడు పురుగు ఉధృతికి అనుకూల వాతావరణ పరిస్థితులు ఏర్పడుతాయి.

నివారణ చర్యలు

ఎకరాకు నాలుగు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. లీటర్ నీటికి 1500పీపీఎం వేపనూనె 5మి.లీ. మొగ్గదశలో స్ప్రేచేయాలి. క్లోరిపైరిపాస్ 2.5ఎంఎల్ లీటర్‌నీటికి కలిపి స్ప్రే చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉంటే ఇమామెక్టిన్ బెంజొయోట్ 0.4గ్రాములు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3మి.లీ, లేదా ఫ్లూవెండమైడ్ 0.3మి.లీ. లీటరు నీటికి కలిపి స్ప్రే చేయాలి.

శనగ పచ్చ పురుగు

తల్లి పురుగు లేతచిగుళ్లపై, పూమొగ్గలపై, లేత పిందెలపై విడివిడిగా లేతపసుపురంగు గుడ్లను పెడుతోంది. గుడ్ల నుంచి వెలివడిన చిన్న లార్వాలు మొగ్గలను, గింజలను తిని డొల్ల చేస్తాయి.

నివారణ చర్యలు

ఎకరాకు 4 లింగాకర్షక బుట్టలను అమర్చుకోవాలి. ఎకరాకు 8–10పక్షి స్థావరాలు అమర్చాలి బంతిపూల మొక్కలను ఎరపంటగా వేయాలి. లీటరు నీటికి 5శాతం వేపనూనె 1500పీపీఎం 5మిలీ మొగ్గదశలో స్ప్రే చేయాలి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఇమామెక్టిన్ బెంజొయోట్ 0.4 గ్రాములు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3మి.లీ, లేదా ఫ్లూవెండమైడ్ 0.3మి.లీ లేదా క్లోరాంట్రానిల్ ప్రోల్, లామ్డాసైహాలోత్రిన్ 0.4మిలీ లీటర్ నీటికి కలిపి స్ప్రే చేయాలి.

కాయతొలిచే ఈగ

తల్లి ఈగ తెల్లగుడ్లను అభివృద్ధి ఎందుతున్న పిందెల్లో చొప్పిస్తుంది. గుడ్ల నుంచి వచ్చే కాళ్లులేని తెల్ల పిల్ల పురుగులు వృద్ధి చెందుతున్న గింజలను చారలు, గుళ్లు చేసి తింటాయి. పురుగు తిన్న గింజ పనికి రాదు. నివారణ కోసం ఎసిఫేట్ 15గ్రా, లేదా లామ్డాసైహలోత్రిన్1మిలీ. లీటర్ నీటికి కలిపి స్ప్రే చేయాలి.

బాల్య వివాహాలు జరగకుండా చూడాలి

- మహిళా సాధికారత జిల్లా జెండర్ స్పెషలిస్ట్ కవిత



ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామాలు, తండాల్లో బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని మహిళా సాధికారత జిల్లా జెండర్ స్పెషలిస్ట్ కవిత అన్నారు. శనివారం మండలంలోని కొత్తచెరువుతండా అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ కౌడిపల్లి సూపర్‌వైజర్ ఖమర్ సుల్తాన ఆధ్వర్యంలో సెక్టార్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నేరమన్నారు. గ్రామాలు, తండాల్లో బాల్యవివాహాలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎక్కడైన బాల్యవివాహాలు జరిగితే 1098 ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. మహిళలు అత్యవసర పరిస్థితుల్లో మహిళా హెల్ప్‌లైన్ 181కు ఫోన్ చేసి, రక్షణ పొందవచ్చని చెప్పారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఖమర్ సుల్తాన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలని పిల్లలకు నాణ్యమైన విద్య, ఆహారం అందజేయాలన్నారు. అనంతరం బాల్యవివాహాల ముక్తభారత్ ప్రతిజ్ఞ చేయించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- రామాయంపేట సీఐ వెంకట్ రాజాగౌడ్



మాట్లాడుతున్న సీఐ వెంకట్ రాజాగౌడ్

రామాయంపేట(మెదక్): మహిళలు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణించాలని స్థానిక సీఐ వెంకట్ రాజాగౌడ్ అన్నారు. మహిళలపై హింసా నిర్మూలన దినోత్సవం సందర్భంగా శనివారం బాలికల గురుకుల డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో హాజరై, ఆయన మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న దాడులు, హింసను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ విషయమై ప్రజల్లో అవగాహన కల్పిస్తే బాగుంటుందని, సమాజంలో మార్పు రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. లింగ వివక్ష రహిత సమాజం కోసం మనం కృషి చేయాలని, మహిళలపై అరాచకానికి పాల్పడితే చట్టం కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అత్యవసర సమయాల్లో మహిళలు, విద్యార్థినులు 181, 1098 ,100, 112 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. అంతకుముందు సఖీ కేంద్రానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ బాల్‌రాజ్, కళాశాల ప్రిన్సిపాల్ శిరీష, పారా మెడికల్ వర్కర్ లక్ష్మి, లెక్చరర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సింహగర్జనకు తరలిరండి

- మాల మహానాడు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శివ



మాట్లాడుతున్న శివ

మాలల కౌడిపల్లి(నర్సాపూర్): డిసెంబర్ 1న హైదరాబాద్ పేరెడ్ గ్రౌండ్‌లో నిర్వహించే మాలల సంహగర్జన బహిరంగ సభకు భారీగా తరలిరావాలని మాల మహానాడు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శివ కోరారు. శనివారం కౌడిపల్లిలో ఆయన మాట్లాడుతూ.. మాలలు ఐక్యతగా ఉంటేనే హక్కులు సాధించుకోగలమని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది మాలలు ఉన్నారని చెప్పారు. జనాభా ప్రాతిపాదికన రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. మాలల సింహగర్జన సభకు భారీగా తరలి వచ్చి సత్తా చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు భూషణం, సంజీవులు, అనీల్, మహిపాల్, కుమార్, రత్నం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఖాజాపూర్ తండాలో బోరుమోటార్

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ఖాజాపూర్ తండాలో కావేరి పరిశ్రమ యజమాన్యం శనివారం బోరువేసి మోటార్ బిగించారు. గ్రామ ప్రజాప్రతినిధులు, పరిశ్రమ సిబ్బంది, పరిశ్రమ హెచ్‌ఆర్ మంజు, కౌశల్ శర్మ, సంతోష్‌గౌడ్, మాజీ సర్పంచ్ లాల్యానాయక్, శివ, జగన్, శ్రీను, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యంతో ఆటో పట్టివేత

నర్సాపూర్: బియ్యం కొనుగోలు చేస్తున్న వ్యక్తికి చెందిన ఆటోను అదుపులోకి తీసుకున్నామని మండల ఆర్‌ఐ సిద్ధిరాంరెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ మాట్లాడుతూ.. నర్సాపూర్‌లోని శివాలయం వీధిలో రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్న ప్రవీణ్‌కు చెందిన ఆటోను తహసీల్దార్ శ్రీనివాస్ ఆదేశాలతో శుక్రవారం అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు. కాగా శనివారం సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ ప్రణీత ఆటోలో ఉన్న బియ్యం శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపారన్నారు. పరీక్ష నివేదిక అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని వివరించారు. ప్రవీణ్ పట్టణంలో తిరుగుతూ ప్రజల దగ్గర బియ్యం కొనుగోలు చేస్తూ, వాటికి బదులుగా జొన్నలు అందచేస్తూ వ్యాపారం చేస్తాడని తెలిసిందన్నారు.

సత్యనారాయణస్వామి సామూహిక వ్రతాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల చాకరిమెట్ల అరణ్యంలో కొలువైన సహకార ఆంజనేయస్వామి ఆలయంలో భక్తుల సందడి సందరించుకుంది. కార్తీకమాసం చివరి శనివారం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అభిషేకం అనంతరం సత్యనారాయణస్వామి మండపంలో వందలాది దంపతులు సామూహిక వ్రతాలు ఆచరించారు. ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ఈఓ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు దేవాదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ, శ్రీవాత్సవ్‌శర్మ ఉన్నారు.



నర్సాపూర్ రైతు వేదికలో పాల్గొన్న ఏడీఏ, ఇతర ఉద్యోగులు, ఆయా గ్రామాల రైతులు



పెద్దశంకరంపేట(మెదక్): వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన రైతులు

రైతు సంక్షేమానికి పెద్దపీట

రైతు పండుగ వేడుకల్లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి రైతులను ఉద్దేశించి శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని రైతులు ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని అన్నారు.



నస్కల్‌లో ముఖ్యమంత్రి సంభాషణను వింటున్న రైతులు



టేక్మాల్‌లో..

అడవికి నిప్పు.. మానవాళికి ముప్పు

- కౌడిపల్లి ఎఫ్‌ఆర్‌ఓ అర్చన



కౌడిపల్లి ఎస్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో అటవీశాఖ అధికారులు

కౌడిపల్లి(నర్సాపూర్): అడవులతోనే వాతావరణం బాగుంటుందని, అడవికి నిప్పు.. మానవాళిక ముప్పు అని కౌడిపల్లి ఎఫ్‌ఆర్‌ఓ అర్చన అన్నారు. శనివారం కౌడిపల్లి ఎస్టీ గురుకుల పాఠశాల, వెల్మకన్న పాఠశాల, గ్రామస్తులకు అడవుల అభివృద్ధి, సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అడవి బాగుంటనే సకాలంలో వర్షాలు కురుస్తాయని జీవజాతి మనుగడ సాగుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు అడవుల అభివృద్ధిపై ఉపన్యాసపోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో ఎస్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఫణికుమార్, డిప్యూటీ ఎఫ్‌ఆర్‌ఓ రాజమణి, సెక్షన్ అధికారులు శ్రీహరి, జలీల్, బీట్ అధికారులు ధనలక్ష్మి, హరిత, రిజ్వాన, వైస్‌ప్రిన్సిపాల్ నరసింహా, భవాని తదితరులు పాల్గొన్నారు.

అందరూ కలిసి మెలిసి ఉండాలి



మాట్లాడుతున్న ఆర్‌ఐ రాజు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని జంగరాయి గ్రామంలో శనివారం పౌరహక్కుల దినం నిర్వహించారు. శనివారం జంగరాయిలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గిర్దవార్ రాజు మాట్లాడుతూ.. గ్రామంలో అందరూ కలిసి మెలిసి ఉండాలని కోరారు. గ్రామంలో ఎలాంటి కుల వివక్షలేకుండా కలిసిమెలిసి జీవించాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఆర్‌ఐ మాత్రమే పాల్గొన్నారు.



రామాయంపేట(మెదక్): ఆందోళన చేపట్టిన సమగ్ర శిక్ష ఉద్యోగులు



నర్సాపూర్: నిరసన దీక్షలో పాల్గొన్న సమగ్ర శిక్ష ఉద్యోగులు



తూప్రాన్: ఎంఈఓకు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

ఉద్యోగులకు రెగ్యులరైజ్ చేయాలి

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని అన్ని మండలాల్లో సమగ్ర శిక్ష ఉద్యోగులు శనివారం ఎంఈవో కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేశారు. అనంతరం ఆయా ఎంఈఓలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వచ్చాక సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఇంతవరకు నెరవేర్చలేదని ఆరోపించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని అన్నారు.



పాపన్నపేటలో..



వెల్దురిలో ..



అల్లాదుర్గంలో ధర్నా చేస్తున్న ఉద్యోగులు

సంక్షిప్త వార్తలు

◆ **మధుమేహంపై జాగ్రత్తగా ఉండాలి**

శివ్వంపేట(నర్సాపూర్): మధుమేహంపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని లయన్స్ క్లబ్ ఆఫ్ బాలనగర్ ఎల్బీ డాక్టర్ సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం చాకరిమెట్ల ఆలయం వద్ద మధుమేహంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ముందస్తు ఆరోగ్య నియమాలు పాటిస్తే అనారోగ్య సమస్యలు దరిదాపుల్లోకి రావన్నారు. ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ ఉన్నారు.

◆ **గడపగడపకు అభివృద్ధి సంక్షేమ ఫలాలు**

నిజాంపేట(మెదక్): ప్రజాపాలనలో పల్లెల్లోని గడపగడపకు అభివృద్ధి సంక్షేమ పథకాలు చేరాయని కళాకారుడు సిద్ధులు అన్నారు. శనివారం ప్రజాపాలన ఏడాది పూర్తిచేసుకుంటున్న సందర్భంగా మండల పరిధిలోని రాంపూర్, జెడ్ చెరువు తండా, నార్లాపూర్ గ్రామాల్లో తెలంగాణ సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కళాజాత యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో సాంస్కృతిక సారధి కళాకారులు మాధవి, కృష్ణ, దేవదాసు, శేఖర్, రామారావు, ఎల్లయ్య, విజయ లక్ష్మి, ఎల్లయ్య, నరసయ్య, రమేశ్ పాల్గొన్నారు.

◆ **ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన**

తూప్రాన్: తూప్రాన్ గీతా హైస్కూలులో విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. విభిన్న ప్రక్రియల్లో చిన్నారులు తయారు చేసిన ప్రాజెక్టులు పలువురిని ఎంతగానో ఆలోచింపజేశాయి. తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం, సైన్స్, కంప్యూటర్ విషయాలకు సంబంధించి ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పి.రామాంజనేయులు మాట్లాడారు. పాఠశాల చైర్ పర్సన్ ఉష, డైరెక్టర్లు రాఘవేందర్ గౌడ్, నారాయణగుప్తా, ప్రిన్సిపాల్ సి.హెచ్.వెంకటకృష్ణారావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రేంరాజ్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

◆ **డేటా ఎంట్రీ 50 శాతం పూర్తి**

చిన్నశంకరంపేట(మెదక్): సమగ్ర సర్వే కుల గణన డేటా ఎంట్రీ 50 శాతం పూర్తి అయిందని ఎంపీడీఓ దామోదర్ తెలిపారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంతో పాటు ఎంఈఓ, మోడల్‌స్కూల్‌లో డేటా ఎంట్రీని పరిశీలించారు. ఇప్పటి వరకు 50 శాతం డేటా ఎంట్రీ పూర్తైందని తెలిపారు.

◆ **ఆలయం వద్ద జ్వాలతోరణం**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయం వద్ద శనివారం అర్చకులు ఉమాశంకరశర్మ, రవిప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో జ్వాలతోరణం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో భ్రమరాంబ మల్లికార్జునస్వామి కల్యాణం, తులసి కల్యాణం, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, జ్వాలతోరణం నిర్వహించారు. కార్యక్రమంలో రాజేందర్ పాల్గొన్నారు.

◆ **దృఢత్వంలో మేటి భారతీ సిమెంట్**



కౌడిపల్లి(నర్సాపూర్): దృఢత్వంలో అన్నింటి కంటే భారతీ సిమెంట్ ఎంతో మేటి అని ఉమ్మడి మెదక్, మహబూబ్‌నగర్ జిల్లా సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ శ్రీకాంత్ అన్నారు. శనివారం రాత్రి మండలంలోని వెంకట్రావ్‌పేటలో తాపీమేస్త్రీలకు భారతీ సిమెంట్ నాణ్యత, మన్నిక, వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తాపీమేస్త్రీలకు రూ. 1లక్ష ప్రమాద బీమా పత్రాలను అందచేశారు. కార్యక్రమంలో ఎంకే ట్రేడర్స్ డీలర్ కుమార్, తాపీమేస్త్రీలు పాల్గొన్నారు.

◆ **స్పందించకపోవడం విచారకరం**

నర్సాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు చనిపోతున్నా.. ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమని జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్షుడు సంతోష్ ఆరోపించారు. శనివారం ఎస్‌ఎఫ్‌ఐ పాఠశాలల బంద్‌లో భాగంగా పట్టణంలో పలు పాఠశాలలు మూసి వేయించారు. మరణించిన విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

◆ **సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఎన్నిక**

పాపన్నపేట(మెదక్): మండల సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా దేవయ్య ఎన్నికయ్యారు. శనివారం జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యక్షుడిగా సంపత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బాల్‌లక్ష్మి, కోశాధికారిగా నవాజ్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా ఏగొండ, సభ్యులుగా స్వప్న, మహేశ్వరి, శ్రీను, దయాశీల, రాజశేఖర్, మహమ్మద్ పాషా, సత్యనారాయణ రెడ్డి, ప్రసాద్ ఎన్నికయ్యారు.